'ఇన్‌స్పైర్' రాష్ట్రస్థాయికి 129 ఎగ్జిబిట్లు

సంగారెడ్డి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాస్థాయిలో 129 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్‌కు ఎంపికయ్యాయి. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 3311 ప్రాజెక్టులు ఎంపిక కాగా జిల్లా నుంచి 129 ప్రాజెక్టులు ఎంపికకావడం పట్ల ఆయా పాఠశాలల విద్యార్థులు, గైడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి అభినందించారు.

విద్యుదాఘాతంతో అన్నదమ్ములు మృతి



జగన్ (ఫైల్)



మల్లేషం (ఫైల్)

జహీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో గురువారం రాత్రి అన్నదమ్ములైన రైతులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గోవిందాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల జగన్ (48), ఎరుకల మల్లేశం(42) అడవిపందుల బెడద నుంచి చెరకు పంటను రక్షించుకోవడానికి చేను చుట్టూ బైండింగ్ వైరు అమర్చారు. దీనికి కరెంట్ సరఫరా ఇచ్చేందుకు పొలం మీదుగా వెళ్తున్న విద్యుత్ హైటెన్షన్ లైన్‌కు కొక్కెలు తగిలించేందుకు ప్రయత్నించారు. ఇందులో పెద్దవాడైన ఎరుకల జగన్ హైటెన్షన్ తీగలకు కొక్కెం తగిలించేందుకు ప్రయత్నిస్తూ ఓ తీగను తగలించి, మరో తీగను పట్టుకున్నాడు. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడి కరెంట్ షాక్‌కు గురై కొట్టుకుంటుండగా, అతని తమ్ముడు మల్లేషం వచ్చి.. జగన్ చేతిలో ఉన్న తీగను తీసేందుకు ప్రయత్నించాడు. దీంతో అతనికీ కరెంట్ షాక్ తగిలి ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాలను జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెస్.. లెస్..

గ్రంథాలయాలకు నిలిచిపోయిన నిధులు

మెదక్ జిల్లాలో రూ.2.20 కోట్లు పెండింగ్

వసతుల లేమితో పాఠకులకు ఇబ్బందులు

కొత్త పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిధుల కొరత



మెదక్‌లో నిర్మించిన జిల్లా గ్రంథాలయ నూతన భవనం

ప్రజల నుంచి ఆస్తిపన్ను వసూలు చేస్తున్న స్థానిక సంస్థల అధికారులకు గ్రంథాలయాలకు సెస్ చెల్లించేందుకు మనసొప్పడం లేదు. లైబ్రరీల నిర్వహణ కోసం ఎంతోకొంత చెల్లించి సరిపెడుతున్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఇంటి పన్నులో 8 శాతం లైబ్రరీసెస్‌ను కలిపి వసూలు చేస్తాయి. కానీ, ఈ మొత్తాన్ని గ్రంథాలయ సంస్థలకు జమ చేయడంలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం, స్థానిక సంస్థలు ఇవ్వకపోవడంతో లైబ్రరీలు అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలు ఉద్యోగాలను భర్తీ చేస్తున్న నేపథ్యంలో నిరుద్యోగులు లైబ్రరీలను ఆశ్రయిస్తున్నారు. కానీ, వసతులు లేక, పుస్తకాల కొరతతో వారికి నిరాశే ఎదురవుతోంది.

మెదక్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ఆస్తి పన్నులో కలిపి వసూలు చేసే గ్రంథాలయ సెస్‌ను పంచాయతీలు, మున్సిపాలిటీలు చెల్లించకపోవడంతో లైబ్రరీల్లో పుస్తకాల కొరత నెలకొంది. మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 15 శాఖా గ్రంథాలయాలు, ఒక జిల్లా లైబ్రరీ ఉన్నాయి. అన్ని గ్రంథాలయాల నిర్వహణకు విద్యుత్ బిల్లులు, వార్తా పత్రికలు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు తదితరాలకు సెస్ ద్వారా వచ్చే నిధులనే వెచ్చించాల్సి ఉంటుంది. గ్రంథాలయాలకు రావల్సిన సెస్ బకాయిలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో సమస్యలు నెలకొంటున్నాయి. జిల్లాలోని పంచాయతీలు రెండేళ్లుగా గ్రంథాలయ సెస్ రూ.1.30 కోట్లు చెల్లించాల్సి ఉంది. మున్సిపాలిటీలు మరో రూ.90 లక్షలు బకాయి ఉన్నాయి. ఇలా కోట్లాది రూపాయలు పెండింగ్‌లో ఉండడంతో కొత్త మండలాలైన హవేళీఘనపూర్, చిలప్‌చేడ్, నిజాంపేట్‌లలో గ్రంథాలయాలు నెలకొల్పడానికి నిధుల కొరత నెలకొంది.

జిల్లా కేంద్రంలోనూ ఇదే పరిస్థితి

మెదక్ కేంద్రంగా జిల్లా ఆవిర్భవించిన అనంతరం రూ.2.50 కోట్ల నిధులతో నూతన భవనాన్ని నిర్మించారు. నిధుల కొరతతో మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్, ప్రహరీ లేక అసంపూర్తిగానే మిగిలిపోయింది. రెండు సంవత్సరాలుగా సెస్ నిధులు నిలిచిపోవడంతో మండల కేంద్రాలలోని లైబ్రరీల్లో సైతం కనీస వసతులు కొరవడుతున్నాయి. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పుస్తకాలను అందుబాటులో ఉంచలేకపోతున్నాయి.

డీపీవోకు ఉత్తరం రాశా



జిల్లాలోని పంచాయతీలు లైబ్రరీలకు సెస్ బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారికి ఉత్తరం రాశా. రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలు సెస్ బకాయిలను ఎంతో కొంత చెల్లిస్తున్నాయి. కానీ, మెదక్ మున్సిపాలిటీ అసలే చెల్లించడం లేదు.

-వంశీకృష్ణ, మెదక్ జిల్లా లైబ్రరీ కార్యదర్శి



'పది'ంతలు చదువుకుందాం

తడబాటు.. ఒత్తిడి అస్సలు వద్దు

కొండపాక, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి.. విద్యార్థి జీవితానికి పునాది వంటిది. ఇక్కడి నుంచే వారి ఉన్నత చదువులకు అడుగు పడుతుంది. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు పదో తరగతిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. మంచి మార్కులు లక్ష్యంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఏడాదంతా చదివినా పరీక్షలంటే విద్యార్థులకు భయం. తడబాటు.. ఒత్తిడి లేకుండా చదివితే పదింతలు నేర్చుకునే అవకాశం ఉంది. ఇందుకు ప్రణాళికతో పాటు ప్రోత్సాహం అవసరం. ఈ నెల 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సబ్జెక్ట్ నిపుణల అభిప్రాయాలు...

భాషాదోషాలు నివారించాలి- 7లో..

అమ్మలా ఆకలి తీరుస్తుంది

● సంగారెడ్డి ఎంసీహెచ్‌లో తల్లి పాల కేంద్రం ● నవజాత శిశువులకు తల్లి పాల సమస్య దూరం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు సరిపోక ఇబ్బందిపడే నవజాత శిశువులకు భరోసా కల్పించేందుకు సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల కేంద్రాన్ని (ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్) ఏర్పాటు చేశారు. అధికారికంగా ప్రారంభించకపోయినా సేవలను మాత్రం జీజీహెచ్ అధికారులు అందుబాటులోకి తెచ్చారు.

తల్లిపాలు అమృతం

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని వైద్యులు సూచిస్తారు. సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలోని ఎంసీహెచ్‌లో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతాయి. 20 పడకల నవజాత శిశు ఆరోగ్యం కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) కూడా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచే కాకుండా ఇతర ఆస్పత్రుల నుంచి కూడా నవజాత శిశువులను ఇక్కడికి చికిత్స కోసం తీసుకొస్తారు. నవజాత శిశువులకు అమృతం లాంటి ముర్రుపాల సమస్యను దూరం చేసేందుకు తల్లి పాల నిల్వ కేంద్రం భరోసా ఇస్తున్నది.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన

రాష్ట్రంలో అధికంగా ప్రసవాలు జరిగే ఆస్పత్రుల్లో సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ప్రథమ స్థానంలో ఉంటుంది. జన్యుపరమైన లోపాలు, ఒత్తిడి, వయసు కారణంగా కొందరు తల్లులకు బిడ్డ పుట్టిన వెంటనే చిన్నారికి సరిపడా పాలు రావు. అలాంటి శిశువులకు డబ్బా పాలు పడుతుంటారు. కానీ ముర్రుపాలతో వచ్చే శక్తిని వారు కోల్పోతారు. మరికొందరిలో శిశువుకు అవసరమైన దానికంటే ఎక్కువ పాలు లభ్యమవుతాయి. శిశువుకు అవసరమైన దానికంటే ఎక్కువ పాలు రావడంతో తల్లికి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో ఎక్కువగా ఉన్న పాలను మిషన్లతో తీసి పారబోస్తుంటారు. కానీ, ఈ తల్లిపాలను సద్వినియోగం చేసుకునేందుకు తల్లిపాల బ్యాంకు ఉపయోగపడుతుంది. తల్లిపాల కేంద్రంలోని అధునాతన మిషన్ ద్వారా డబ్బాల్లో పాలు సేకరించి అవసరమైన నవజాత శిశువులకు పట్టిస్తారు. ఈమేరకు తల్లులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మిగులిపోయే పాలను బ్యాంకులు ఇచ్చేలా వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు.

నవజాత శిశువులకు భరోసా

నవజాత శిశువులకు తల్లి పాల కేంద్రం ఎంతో సహాయపడుతుంది. తల్లి నుంచి సరిపడా స్తన్యం అందక ఇబ్బంది పడుతున్న చిన్నారులకు కేంద్రంలో ఉచితంగా అందజేస్తున్నాం. తల్లులకు స్వచ్ఛందంగా పాలు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం.

-అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి

తల్లుల సమ్మతితోనే..

తల్లిపాల కేంద్రంలో తల్లుల సమ్మతితోనే పాలను సేకరిస్తున్నారు. స్వచ్ఛందంగా వచ్చిన తల్లుల నుంచి పాలను సేకరించి వాటిని తల్లి పాల కేంద్రంలో ప్రత్యేక జాగ్రత్తలతో భద్రపరుస్తారు. ఇప్పటి వరకు 30 మంది బాలింతల నుంచి ముర్రుపాలు సేకరించారు.

పల్లెల్లో పని చేయడమంటే భారమా?

కల్హేర్ మండలంలో పని చేసేందుకు మొగ్గుచూపని టీచర్లు

స్కూలు మూతపడే పరిస్థితి ఉన్నా కోరుకున్న చోటికి డిప్యూటేషన్లు



కల్హేర్ మండలం తుకారాం తండాలో ఇతర పాఠశాల నుంచి వచ్చి విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

కల్హేర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతంలోని తండాలో పనిచేయడానికి ఉపాధ్యాయులు ఆసక్తి చూపరు. అలాంటిది రెగ్యులర్ పోస్టింగ్ వచ్చిన టీచర్‌కు పట్నం శివార్లకు డిప్యుటేషన్‌పై పంపించి.. ఆ స్థానంలో పక్క ఊరి నుంచి మరో టీచర్‌ను డిప్యుటేషన్‌పై తీసుకురావడం సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులకే చెల్లింది. కల్హేర్ మండల పరిధిలోని జంలాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తుకారాం తండా ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు చదువుతున్నారు. వీరికి బోధించడానికి ఎస్జీటీ ఎం.మాధవిని కౌన్సెలింగ్ ద్వారా నియమించారు. కానీ, ఆమె పలుకుబడిని ఉపయోగించి హైదరాబాద్ నగర శివార్లలోని తెల్లాపూర్‌కు డిప్యుటేషన్ వేయించుకుంది. ఇక్కడ టీచర్ లేక స్కూల్ మూతపడే పరిస్థితి రావడంతో బీబీపేట ప్రాథమిక పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని తుకారాంతండాకు పంపిస్తున్నారు. ఆయన సక్రమంగా రాకపోవడంతో పిల్లలు మధ్యాహ్న భోజనం తిని వెళ్లిపోతున్నారని తండావాసులు వాపోతున్నారు. కృష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. ఇక్కడ ఇంగ్లిష్ ఎస్ఏ సువర్ణను కూడా డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఇక్కడ ఆంగ్లం బోధించడానికి ఎవరూ లేకపోవడంతో రాపర్తి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఎస్జీటీని ఉపాధ్యాయుడిని పంపించి పాఠాలు చెప్పిస్తున్నారు. అలాగే, బీబీపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ సంధ్యారాణి డిప్యుటేషన్ వేయించుకోవడంతో మిగిలిన ఉపాధ్యాయులు పనిభారంతో సతమతమవుతున్నారు. ఈ వ్యవహారంపై మండల విద్యాధికారి శ్రీనివాసులను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించామని, ఇందులో తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.



సంగారెడ్డిలో ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. 15,989 మందికి 15,687 మంది హాజరయ్యారు. 98.11 హాజరు శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద రామ్ తెలిపారు. సంగారెడ్డిలోని శ్రీఅక్షయ, రాయల్, సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

మెదక్ జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 30 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు నిర్వహించిన పరీక్షలకు 5,427 మందికి గానూ 5,320 మంది హాజరయ్యారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు సెంటర్లను సందర్శించి పరీక్షా నిర్వహణను పరిశీలించారు. జిల్లాలో 98.20శాతం హాజరు నమోదైందని, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్నవే కాకుండా పట్టణంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను పోలీసులు ముందుజాగ్రత్తగా మూసివేయించారు.

రంజాన్ వేళలు

శుక్రవారం ఇఫ్తార్: సాయంత్రం 6.30

శనివారం సహర్: ఉదయం 5.08

నిరంతరాయంగా కరెంటు ఇవ్వండి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్

పాపన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రవేశించినందున నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. పాపన్నపేట మండలం మిన్పూర్‌లోని సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. జిల్లాలో ఓవర్ లోడ్ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ డీఈ బాషా, సబ్ డివిజనల్ ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పగలు ఎండ తీవ్రత.. రాత్రి వణికించే చలి!

ఉమ్మడి మెదక్ జిల్లాలో భిన్నమైన వాతావరణం

గరిష్ఠం 37.3 డిగ్రీలు, కనిష్ఠం 9.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



మెదక్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు భిన్నంగా నమోదవుతున్నాయి. రాత్రిపూట చలి వణికిస్తుండగా.. పగలు ఎండ సుర్రుమంటున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పగలు గరిష్ఠ ఉష్ణోగ్రత 37.3 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రత 9.9 డిగ్రీలకు దిగువగా నమోదవుతున్నాయి. దీంతో, ప్రజలు ఇటు చలి, అటు ఎండకు ఇబ్బంది పడుతున్నారు.

ఉష్ణోగ్రతలు ఇలా...

సంగారెడ్డి జిల్లా అల్మాయిపేటలో 9.9 డిగ్రీలు, నల్లవల్లి 10.0, కోహీర్ 10.8, జిన్నారం 11.1, లక్ష్మీసాగర్ 11.2, అన్నాసాగర్ 11.3, హత్నూర 11.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా గుండ్లమాచనూర్‌లో 35.4 డిగ్రీలు, కల్హేర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోత్రలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లా నంగునూర్‌లో 10.4, పోతారెడ్డిపేట 10.5, మిరుదొడ్డి 10.7, కొండపాక 10.9, హబ్షీపూర్ 11.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా సిద్దిపేట 36, పోతారెడ్డిపేట 35.9, కట్కూర్ 35.7, తుక్కాపూర్ 35.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లా బోడగాట్‌లో 11 డిగ్రీలు, దామరంచ 11.2, వెల్దుర్తి 11.4, పెద్దశంకరంపేట 11.6, నాగాపూర్ 11.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదేసమయంలో కొల్చారంలో 37.3, టేక్మాల్ 36.6, దామరంచ 36.3, కాగజ్‌మాద్దూర్ 35.7, చిన్నశంకరంపేట 35.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



కూచన్‌పల్లిలో ప్రీఫైనల్ పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

'పది' ప్రీ-ఫైనల్

మెదక్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు జిల్లావ్యాప్తంగా ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం ప్రశాంత వాతావరణంలో ఓఎంఆర్ పత్రాలతో పరీక్షలు ప్రారంభమయ్యాయి. గ్రేడింగ్ ప్రక్రియకు సర్కార్ స్వస్తి పలకడంతో ఈసారి మార్కులు ప్రామాణికం కానున్నాయి. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహపడుతాయి. జిల్లావ్యాప్తంగా 10,387 మంది విద్యార్థులుండగా.. ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు ఓఎంఆర్ పత్రాలు ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అవగాహన కోసమే..

పదో తరగతి వార్షిక పరీక్షల్లో తొలిసారి ఓఎంఆర్ పత్రాలు చూస్తున్న విద్యార్థులు అవగాహన లేక ఇబ్బందిపడుతున్నారు. దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రీ ఫైనల్‌లో ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు ఓఎంఆర్ పత్రాలను అందజేస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

డ్రైవింగ్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు డ్రైవింగ్ నేర్చుకోవడంతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, స్వయం ఉపాధి కూడా పొందవచ్చని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా అధ్వర్యంలో మహిళలకు రెండో విడత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉండటం మహిళా డ్రైవర్లకు మంచి అవకాశాలు ఉంటాయన్నారు. మహిళలు డ్రైవర్లుగా ఉంటే క్యాబ్‌లో ప్రయాణించే మహిళలకు భద్రత ఉంటుందన్నారు. మహిళా క్యాబ్ డ్రైవర్లు స్వయం ఉపాధి పొందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ మనోజ్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, శిక్షణకు సహకరిస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అదనపు డీఆర్‌డీవోల, డీపీఎంలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ప్రయోజనం



డీడీఎస్-కేవీకేలో తయారుచేసిన సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ వ్యవసాయంతోనే ప్రయోజనం ఉంటుందని డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త,హెడ్ డా. వర ప్రసాద్, తదితరులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దిడిగి శివారులో గల డీడీఎస్-కేవీకే(డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం)లో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు, యువతకు తేనెటీగల పెంపకం, వర్మీ కంపోస్టు, శాస్త్రీయ పద్ధతుల్లో నారు, మేకల, పశువుల, మట్టి పరీక్షలు చేసే పద్ధతులు, జీవన ఎరువులు, సేంద్రియ వ్యవసాయం, ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ,స్నేహలత, రమేష్, హేమలత, సాయిప్రియాంక, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

సంగారెడ్డి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేడు సంగారెడ్డి పట్టణంలోని చాణక్యపురి 2,300 కేఎల్ సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు పరిధిలోని పలు కాలనీలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును శుభ్రం చేసే పనులు చేపడుతున్నందున ఆయా కాలనీలకు నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలకు అత్యవసరంగా తాగునీటిని మునిసిపల్ ట్యాంకర్లు, పవర్ బోర్ల ద్వారా అందజేస్తామని చెప్పారు. శుభ్రం చేసే పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



మాల్యాతండాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

శివ్వంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మల్యాతండాలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బోజ్యతండా పంచాయతీ పరిధిలోని మాల్యాతండాలో నాలుగురోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి వేసవిలో తాగునీటికి ఇబ్బందిపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోయారు. పంట పొలాల నుంచి కూడా నీటిని తీసుకుపోనివ్వడం లేదని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థులు

చిన్నశంకరంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని సూరారం, శాలిపేట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తక్కడ సంధ్య, రావణబోయిన నవనీత, 7వ తరగతి చదువుతున్న బోండ్ల సంపత్ కుమార్, అలాగే నార్సింగి మండలం శేరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కట్ట ప్రవళిక తయారుచేసిన సైన్స్ నమూనాలు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ 2024-25 అవార్డుకు ఎంపికయ్యాయని ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, తౌడ తిరుపతి తెలిపారు.

అల్లొల్‌లో వ్యక్తి అదృశ్యం



రాజు(ఫైల్)

జహీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని అల్గోల్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ఎరుపుల రాజు(30) ఈ నెల 2న ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య పద్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కాశీనాథ్ వివరించారు.

మద్యం ఇవ్వలేదని కిరాణషాపు యజమానిపై దాడి

హవేళిఘణపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం ఇవ్వలేదని కిరాణషాపు యజమానిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన హవేళిఘణపూర్ మండలం సర్దన గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బంగారయ్య కిరాణషాపు నడుపుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన కుర్మ బీరయ్య బుధవారం అర్ధరాత్రి బంగారయ్య ఇంటి తలుపులు కొట్టాడు. చీకటిలో ఎవరూ కనిపించకపోవడంతో తలుపులు వేసుకొని ఇంట్లోకి వెళ్లగా బీరయ్య కనిపించాడు. ఇంట్లోకి ఎందుకు వచ్చావని బీరయ్యను అడగ్గా.. మద్యం కావాలన్నాడు. లేదు.. ఇంట్లోంచి వెళ్లమనగా.. బీరయ్య సీసా ముక్కతో బంగారయ్యపై దాడి చేయగా.. మెడభాగంలో తీవ్రగాయాలయ్యాయి. సమీప ప్రజలను పిలవగా.. బంగారయ్యను 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కుంటలో జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. గజ్వేల్ మండలం సంగుపల్లి గ్రామానికి చెందిన బడె యాదగిరి (43) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన యాదగిరి ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం మధ్యాహ్నం పాతకుంటలో శవమై కనిపించాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుమ్మడిదల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని ఎర్ర చెరువులో గురువారం ఓ వ్యక్తి మృతదేహం ఉన్నదని గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకుతీశారు. మృతుడికి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. గ్రామస్థుడు ఆనంద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా, ఆరుగురికి గాయాలు


నిజాంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలైన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన రాగి రాజయ్య కూతురు పెళ్లిచూపులకు (ఏపీ 23 టీఏ 2219) నంబరు గల ఆటోలో దుబ్బాకకు వెళ్లి తిరిగి వస్తున్నారు. నిజాంపేట పెట్రోల్ బంక్ వద్ద వాహనం అడ్డురాగా.. తప్పించబోయి ఆటో పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఆటోలో ఉన్న రాజయ్య బంధువుల్లో ఒకరికి తీవ్ర, ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమందించగా.. హుటాహుటిన రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దాడి కేసులో నిందితుడికి నెల జైలు

జోగిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సొంత కుటుంబీకురాలైన మహిళపై చేయిచేసుకున్న కేసులో నిందితుడికి ఒకనెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ... జోగిపేట మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ ధనలక్ష్మి తీర్పునిచ్చారు. 2014లో జరిగిన ఒక కేసులో... జోగిపేటకు చెందిన డాకూరి కుమార్ సొంత బంధువైన మహిళపై దాడిచేశాడు. నేరం రుజువైనందున సదరు నిందితుడు కుమార్‌కు జైలు శిక్షతోపాటు, రూ.1000 జరిమానా విధిస్తూ ఆమె తీర్పునిచ్చారు.

'పది'ంతలు చదువుదాం

తడబాటు.. ఒత్తిడి అస్సలు వద్దు



పదో తరగతి పరీక్షలంటే ఏ మాత్రం భయం వద్దని అంటున్నారు ఉపాధ్యాయులు. పక్కా ప్లానింగ్‌తో చదివితే విజయం మీదే అంటున్నారు. కొంచెం కష్టపడితే ఎక్కువ మార్కులు సాధించవచ్చునంటున్నారు. పరీక్షలంటే భయం లేకుండా ఎలా రాయాలో వారి మాటల్లోనే..

-(కొండపాక, ఆంధ్రజ్యోతి)

భాషా దోషాలు నివారించాలి



తెలుగు పరీక్షలో చేతిరాత అందంగా ఉండేటట్లు చూసుకోవాలి. అక్షరదోషాలు, భాషాదోషాలు దొర్లితే మార్కులు తగ్గించే అవకాశం ఉంది. పార్ట్-ఏలో రెండు విభాగాలు ఉంటాయి. అవగాహన-ప్రతిస్పందనకు చెందిన మొదటి విభాగంలో అపరిచిత గద్యాన్ని ఇస్తారు. అవగాహన చేసుకుని సమాధానాలు రాయాలి. పతిపదార్థాలపై పట్టు పెంచుకోవాలి. పది మార్కుల పేరాగ్రాఫ్ కూడా మార్కుల సాధనలో కీలకమే. రెండవ విభాగంలో వ్యక్తీకరణ-సృజనాత్మకతకు సంబంధించి ఒక ప్రశ్న పాఠ్యభాగ రచయిత లేదా కవి పరిచయం గురించి ఉంటుంది. గద్య, పద్యభాగాలు, ఉపవాచకం నుంచి ప్రశ్నలు వస్తాయి. అభినందన పత్రం, లేఖ, ముఖాముఖీ, సంభాషణ, కవితలలో ఏదైనా ఒకటి రాయమంటారు. సొంతవాక్యాలు, కర్తరీ, కర్మణీ వాక్యాలు, సామాన్య, సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, చందస్సులో గణ విభజన, పద్య గణాలు, యతిస్థానాలు, అక్షరాల సంఖ్య గుర్తించడం వంటి ప్రశ్నలుంటాయి. ప్రకృతి వికృతులు, నానార్థాలు, పర్యాయపదాలు అడుగుతారు. ఇందుకోసం పదజాలంపై పట్టు పెంచుకోవాలి.

- ఆదిరాల సాయినాథ శర్మ, స్కూల్ అసిస్టెంట్, తెలుగు

సమస్యల సాధనపై దృష్టి పెట్టాలి..



గణితంలోని చాప్టర్లలోని అంశాలను అవగాహన చేసుకుని సమాధానాలు రాస్తే ఎక్కువ మార్కులు పొందుతారు. సమస్యలను సాధించేటప్పుడు దత్తాంశాన్ని గుర్తించి తగిన సూత్రాన్ని రాసి సమస్య సాధనలో ఉపయోగించాలి. కరణీయ సంఖ్యలను నిరూపించాలి. అంతమయ్యే, అంతం కానట్టి ఆవర్తితమయ్యే అకరణీయ సంఖ్యలను దశాంశ రూపంలో రాయగలగాలి. సంవర్గమాన విలువలు, సంవర్గమాన విస్తరణల లెక్కలు ప్రాక్టీస్ చేయాలి. సమితులలో సమ్మేళనం, ఛేదనం, భేదం, వెన్ చిత్రాలు, కార్డినల్ సంఖ్యలపై సమస్యలను సాధన చేయాలి. ఇచ్చిన సమితికి ఉపసమితులను రాయడం నేర్చుకోవాలి. రేఖీయ సమీకరణాలకు సంబంధించి రెండు వేరు వేరు చరరాశులలో ఒకదాని ఎన్నుకొని వాటి గుణకాలను సమాన చేయాలి. ఇలా చేసిన తర్వాత ఆ సమీకరణాలను కూడడం లేదా తీసివేయడం ద్వారా రేఖీయ సమీకరణాలను రాశి తొలగింపు పద్ధతిలో సాధించవచ్చు. చరరాశుల గుణకాల నిష్పత్తులను కనుగొని అవి ఖండించే లేదా సమాంతర లేదా ఏకీభవించే రేఖలా అనే విషయాన్ని గుర్తించి 'కె' విలువను సులభంగా తెలుసుకోవచ్చు. వర్గ సమీకరణాల సమస్యలను సాధించాలి. రేఖీయ, వర్గ సమీకరణాలను, బహుపదులను గ్రాఫ్ ద్వారా సాధించడం ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్ లెక్కలలో స్కేలును రాయడం మర్చిపోవద్దు. స్కేలును రాయడం మర్చిపోతే మార్కులు తగ్గిస్తారు. శ్రేడులపై పట్టు సాధించాలి. ఇచ్చిన త్రిభుజానికి దత్త నిష్పత్తిలో సరూప త్రిభుజ నిర్మాణాన్ని, స్పర్శరేఖల నిర్మాణాన్ని ప్రాక్టీస్ చేయాలి. నిర్మాణాలకు సంబంధించిన సమస్యలకు సమాధానం రాసేటప్పుడు ముందుగా చిత్తుపటాన్ని గీయాలి. తరువాత ఇచ్చిన కొలతలకు సరిపోయే విధంగా నిర్మాణాన్ని గీసి సోపానాలను వరుస క్రమంలో రాయాలి. ప్రాథమిక అనుపాత సిద్ధాంతం, పైథాగరస్ సిద్ధాంతం అనువర్తనాలకు సంబంధించిన సమస్యలను సాధనచేయాలి. త్రికోణమితిలో పటాన్ని గీసి ఉర్ధ్వ, నిమ్న కోణాలను గుర్తించి త్రికోణమితి నిష్పత్తుల ద్వారా అనుభవించి ప్రశ్నలను సాధించవచ్చు. త్రికోణమితీయ అనువర్తనాలు అధ్యాయంలోని రెండు అభ్యాసాల్లోని సమస్యలకు చిత్తు పటాలు గీయగలగాలి. సంభావ్యతలో నాణెం ఎగరవేయడం, పాచికను దొర్లించడం వంటి ప్రయోగాలను పర్యవసానాలను నేర్చుకోవాలి. రెండు నాణేలు ఒకేసారి ఎగరవేసినప్పుడు, రెండు పాచికలను ఒకేసారి దొర్లించినప్పుడు ఏర్పడే ప్రతిరూప ఆవరణలను రాయగలగాలి. సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, క్షేత్రమితి లోని సూత్రాలు తెలిసి ఉండాలి. ఆయా అధ్యాయాలలోని సూత్రాలను రాసి, పదాలను వివరించేలా సూత్రాలను నేర్చుకోవాలి. సాంఖ్యక శాస్త్రంలో ఓజీవ్ వక్రం గీసి మధ్యగతం కనుక్కోవాలి.

- కత్తుల లక్ష్మారెడ్డి, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు.

నిత్యజీవిత అనువర్తనాలపై పట్టు పెంచుకోవాలి



భౌతిక రసాయనశాస్త్రంలో అన్ని పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. పాఠ్య పుస్తకంలో సుమారు 21 నిత్య జీవిత అనువర్తనాలు ఉన్నాయి. వాటిలో కటకాలు, దర్పణాలు, వాటి ఉపయోగాలు, పి హెచ్ విలువ ఉపయోగం, కాంతి పరిక్షేపణం, ఎలక్ట్రికల్ మోటార్ మొదలైనవి చదవాలి. దర్పణాలు, కటాకలలో కిరణ రేఖాచిత్రాలు, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి నివారణ చిత్రాలు, మాయిలర్ చిత్రం, అమ్మోనియా నీటి అణువుల చిత్రాలు సాధన చేయాలి. పి, డి ఆర్బిటాళ్ళ చిత్రాలు ప్రాక్టీస్ చేయాలి. ప్రయోగశాల కృత్యాలలో పుటాకార దర్పణ నాభ్యంతరం, కటకనాభ్యంతరం కనుగొనుట, లోహాలు ఆమ్లంతో చర్య పొందినప్పుడు హైడ్రోజన్ వాయు వెలువడుతుంది అనే ప్రయోగము, ఓం నియమంలో నిరోధాన్ని కనుగొనే ప్రయోగం, తుప్పు పట్టడానికి గాలి నీరు అవసరము అనే ప్రయోగం రావడానికి అవకాశం ఉంది. దర్పణ, కటక సూత్రాలు, ఓం, కిర్కాఫ్ నియమాలు, నిరోధాలలో శ్రేణి, సమాంతర సంధానాలపై లెక్కలు ప్రాక్టీస్ చేయాలి. ఆఫ్ బో నియమం, హుండ్ నియమం, పౌలి వర్జన నియమం, క్వాంటం సంఖ్యలు, ఆధునిక ఆవర్తన పట్టికపై అవగాహన పెంచుకోవాలి. ప్రతి ప్రయోగశాల కృత్యంలో పరికరాల జాబితాను గుర్తు పెట్టుకోవాలి. విద్యుత్ అయస్కాంతత్వంలో అంపియర్ కుడిచేతి బొటనవేలు నియమం, ఫారడే నియమం, ఫ్లెమింగ్ ఎడమచేతి నియమాలు ముఖ్యమైనవి. కర్బన సమ్మేళనాలలో ఐయూపీఏసీ నామకరణంపై పాఠ్య పుస్తకంలోని ఉదాహరణలు, ప్రమేయ సమూహాలు గుర్తుంచుకోండి. సంగ్రహణ శాస్త్రంలో ఖనిజాల పేర్లను వాటి సంకేతాలను నేర్చుకోవాలి. ఫ్రాత్ ఫ్లోటేషన్, మాగ్నెటిక్ సెపెరేషన్, రివర్బరోటరీ కొలిమి చదవడం మర్చిపోవద్దు.

-పి.భగవాన్, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు

అన్వయించుకుంటే అ'సామాన్య' ఫలితం



దైనందిన జీవితంలో సైన్సు సూత్రాలను అన్వయించుకుని చదవడం వల్ల విషయంపై పట్టు పెరుగుతుంది. గత ప్రశ్న పత్రాలతో పాటు ప్రయోగ విధానాలను అధ్యయనం చేయాలి. ప్రతి పాఠంలో బొమ్మలను గీయడం సాధన చేయాలి. వాటి భాగాలను సరిగ్గా గుర్తించాలి. పట్టికలను విశ్లేషణ చేయడం నేర్చుకోవాలి. ప్రయోగ విధానాలు, పరికల్పనలు, బొమ్మలు గీయటం, భాగాలు గుర్తించాలి. నిర్వచనాలు, భేదాలు, పోలికలు గుర్తుంచుకొని రాయాలి. పట్టికల సాధనతో అధిక మార్కులు సాధించవచ్చు.

-జీడిపల్లి సురేందర్ రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

హిందీ పాఠ్య పుస్తకం పూర్తిగా చదవాలి



హిందీలో అధిక మార్కులు సాధించాలంటే పాఠ్యపుస్తకం పూర్తిగా చదవాలి. నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేయాలి. అక్షర దోషాలు ఉండకుండా చూసుకోవాలి. సమాధానం రాసేటప్పుడు కొట్టివేతలు ఉండకూడదు. చేతిరాత బాగుండాలి. వ్యాకరణ అంశాలను క్షుణ్ణంగా చదువుకోవాలి. మొదటి విభాగంలో ఉపవాచకము నుంచి శాంతికి రహనే, హమ్ సబ్ ఏక్ హై, అప్నే స్కూల్ కో ఏక్ ఉపహార్, అనోఖే ఉపాయ్ పాఠాలు చదవాలి. ఉత్తీర్ణత సాధించేందుకు పేరాగ్రాఫ్ సాధన కీలకంగా ఉంటుంది. పార్ట్-బిలో సమాధానాలను గుర్తించేటప్పుడు కొట్టివేతలు, దిద్దడాలు చేయవద్దు. నాలుగు ఆప్షన్లలో సరైన ఆప్షన్‌ను నమోదు చేసేటప్పుడు ప్రశ్నపత్రంలో ఆప్షన్‌కు ఉన్న అక్షరాన్ని యధాతథంగా రాయాలి. అంటే ఆప్షనులో ఆంగ్లంలోని చిన్నఅక్షరం ఉంటే చిన్న అక్షరాన్ని పెద్ద అక్షరం ఉంటే అక్షరాన్ని మాత్రమే రాయాలి.

- ఎం. రాజయ్య, స్కూల్ అసిస్టెంట్, హిందీ

ఆంగ్లంలో అక్షర దోషాలు ఉండొద్దు



ఆంగ్లంలో సారాంశాన్ని గ్రహించి సొంతంగా నోట్స్ రాసుకోవాలి. పార్ట్- ఏ, బీ, సీ సెక్షన్లపై అవగాహన పెంచుకోవాలి. అక్షర దోషాలు ఉండొద్దు. ప్రతి ఎనిమిది అక్షర దోషాలకు పావు మార్కు తగ్గిస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత వరకు అక్షరదోషాలు లేకుండా సమాధానాలు రాయాలి. వీటితోపాటు విరామ చిహ్నాల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వాక్యాలను రాయాలి. గ్రూప్ ఏలో స్టోరీ, నరేషన్, కన్వర్జేషన్, డ్రామా/స్క్రిప్ట్, ఇంటర్వ్యూ, కొరియోగ్రఫీ, గ్రూప్ బీలో బయోస్కెచ్, ఎస్సే లెటర్ రైటింగ్, స్పీచ్, న్యూస్ రిపోర్ట్ ఉంటాయి. మైనర్ డిస్ కోర్సెస్ లోని మెసేజ్, నోటీస్, డైరీ ఎంట్రీలో నుంచి ఒక ప్రశ్న, పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్‌ల నుంచి ఒక ప్రశ్న ఉంటుంది. మేజర్ డిస్ కోర్సెస్, మైనర్ డిస్ కోర్సెస్ బాగా ప్రాక్టీస్ చేయాలి. టెక్ట్ డిపెండెంట్, ఇండిపెండెంట్ అంశాలపై పట్టు సాధించాలి. పద్యభాగంలో ముఖ్యపదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, ఆక్టివ్, పాసివ్ వాయిస్ ప్రాక్టీస్ చేయాలి. రాయడంలో, వ్యాసాలను చదవటంతో పాటు సాధన చేయాలి. పాత పరీక్ష పత్రాలను అవగాహన చేసుకుని పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలి.

-బి.సత్తయ్య, స్కూల్ అసిస్టెంట్, ఆంగ్లం

సాంఘికశాస్త్రం.. అవగాహనే కీలకం



సాంఘిక శాస్త్రం ప్రధానంగా అవగాహనకు సంబంధించిన సబ్జెక్టు. సాంఘిక శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించాలంటే ఇచ్చిన ప్రశ్నను అర్థం చేసుకొని రాయగలగాలి. ప్రశ్న చాలా రూపాలుగా అడగవచ్చు. ఉదాహరణకు: వివరించండి, కారణాలు తెలపండి, తేడాలు తెలపండి ఇలా వివిధ రకాలుగా ఉండవచ్చు. విద్యార్థులకు భారతదేశం, ప్రపంచపటం, తెలంగాణ పటాలపై పూర్తి అవగాహన ఉండాలి. మ్యాప్ డ్రాయింగ్, మ్యాప్ రీడింగ్ రెండింటిలో అవగాహన ఉండాలి. దత్తాంశ విశ్లేషణ (డాటా అనాలసిస్) ప్రశ్నలు వస్తాయి. ఇచ్చిన డాటాను అర్థం చేసుకొని సమాధానం రాయాలి. జనాభా సమస్య, బాలికల విద్య, పర్యావరణం, కాలుష్యం, యుద్ధాలు, నీరు మొదలైన అంశాలపై నినాదాలు, కరపత్రం తయారీ వంటి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మీద పటాలు, నినాదాలు, కరపత్రం తయారీ, దత్తాంశ విశ్లేషణ(డేటా అనాలసిస్), పేరాగ్రాఫ్ చదివి వ్యాఖ్యానించడం మొదలైన అంశాలతో పాటు పాఠ్యాంశంపై పూర్తి అవగాహన ఉంటే సాంఘికశాస్త్రంలో ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. తేలికైన వాటిని ముందుగా చదివి కఠిన అంశాలను బాగా సాధన చేయాలి. పట నైపుణ్యాలు పెంచుకుని మ్యాప్‌పాయింటింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి, సమాచార నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యానాలు రాయటంపై దృష్టి సారించాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై పట్టుంటే ఎక్కువ మార్కులొస్తాయి. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. 'అభ్యాస దీపిక'లోని అంశాలను బాగా చదవాలి.

- వై. రాంగోపాల్ రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు

అప్పుల బాధతో ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

కౌడిపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లు కట్టేందుకు చేసిన అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చనిపోయాడు. ఈ ఘటన మండల పరిధి కంచన్‌పల్లిలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయినికుమార్ (38) కొద్ది రోజుల క్రితం కొత్త ఇల్లు కట్టాడు. ఇందుకోసం సుమారు రూ. 40 లక్షల వరకు అప్పు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో అప్పు తీరే మార్గం కనిపించలేదు. దీంతో ఈ నెల 3న ఉదయం ఇంటి స్లాబ్‌పై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో బుధవారం రాత్రి చనిపోయాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి..



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రామంచలో గురువారం జరిగింది. ఎస్సై బాలకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీకాంత్‌రెడ్డి (38) ఆర్మీలో పని చేసి, ఐదేళ్ల క్రితం రిటైర్ అయ్యారు. హైదరాబాద్‌లో ఉంటూ పలు వ్యాపారాలు చేయగా, నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు పెరిగి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. బుదవారం హైదరాబాద్ నంచి వచ్చిన శ్రీకాంత్ గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన అప్పులు

బెజ్జంకి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తన్నపేటలో ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాజె రవి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పిల్లల చదువు, వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పు తీరే మార్గం కనిపించక బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రవికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య గాజె రేణుక గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేయండి

ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



కంది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ద్వారా పరిశోధనను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో గురువారం ఇండియన్ నేషనల్ యంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో సైన్స్ కమ్యూనికేషన్ అవుట్ రీచ్ అండ్ పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ (స్కోప్) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వివిధ జాతీయస్థాయి విద్యాసంస్థల సైన్స్ ప్రొఫెసర్లు, పరిశోధకులు హజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన గ్లోబల్ అకడమిక్ ర్యాంకింగ్స్, ఇంటర్ డిసిప్లినరీ సహకారం సరికొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. స్టార్టప్‌లు, స్వదేశీ సాంకేతికత అభివృద్ధి చేస్తూ విద్యార్థుల కేంద్రీకృత విద్యను పెంచడంపై దృష్టిపెట్టాలన్నారు. దేశ స్వావలంబన, శాస్త్రీయ సహకారంతో సోషల్‌మీడియా, విజువల్ స్టోరీ టెల్లింగ్, ఇన్ఫోగ్రాఫిక్స్, ఏఐ టూల్స్ ఉపయోగించడంపై కోర్సు మాడ్యూల్స్‌ను ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు. వివరణాత్మక వర్క్‌షాప్‌ల ద్వారా జాయ్ ఆఫ్ రీసెర్చ్ అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకుల మధ్య స్వతంత్ర పరిశోధన ఆలోచనలను పెంపొందించాలని, విద్యార్థులు, తద్వారా సైన్స్‌లో యువతలో ఉత్సాహం ఉండే వాతావరణాన్ని నిర్మించాలని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి అండ



మర్కుక్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు రమణారావు ఆలోచన రెం డు కుటుంబాలకు అండగా నిలిచిం ది. చందాయిపేట గ్రామానికి చెంది న శ్రీనివాస్, గొల్లపల్లితండాకు చెంది న రమేష్‌నాయక్‌లు సీఆర్పీలు విధి నిర్వహణలో ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలిసిందే. దీంతో రమణారావు వెంటనే లయన్ ఉత్తమ ఉపాధ్యాయుడు అమర్నాథ్‌తో సీఆర్పీలు లచ్చిరామ్‌నాయక్, ఎంఐఎస్ వెంకటేశం, రాయపోల్ సీఆర్పీ యాదగిరి, వివిధ ఉపాధ్యాయ సంఘ నేతలు శశిధర్‌శర్మ, మల్లికార్జున్‌ల సహకారంతో వాట్సాప్‌లో ఫండ్ రేజింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం లక్షా తొంబై వేలు సేకరించి, గురువారం బాధిత కుటుంబాలకు అందించారు. సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి వీరిని అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు(ములుగు) ఉదయభాస్కర్‌రెడ్డి, వెంకట్‌రాములు(మర్కుక్), సత్యనారాయణ రెడ్డి (రాయపోల్)లు, మర్కుక్ మండల పీఆర్టీయూ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ఖైదీలకు రుచికరమైన భోజనం పెట్టాలి



కంది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఖైదీలకు రుచికరమైన భోజనం పెట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ సూచించారు. కందిలోని సెంట్రల్ జైల్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. జైలు ఆవరణ పరిశీలించారు. జైలులో సదుపాయాలను, భోజనం గురించి ఖైలను అడిగి తెలుసుకున్నారు. సమయానికి బెయిల్స్, ములాఖత్‌లు అందుతున్నాయా? అడిగి తెలుసుకున్నారు. న్యాయసేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని చెప్పారు. ఖైదీల భోజనం రుచి చూశారు. ఆవరణలోని పూల మొక్కలు, కూరగాయలతోటను పరిశీలించారు.

మిర్చిలో మల్చింగ్

సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



అక్కన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చు ఎక్కువ దిగుబడి సాధించే దిశగా రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు అధునాతన పద్ధతులను పాటిస్తుండగా, కొత్తగా మల్చింగ్ పద్ధతిలో మిర్చిసాగు దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. మొదటిసారి మండలంలోని కుందనావానిపల్లి గ్రామంలో ఓ రైతు మల్చింగ్ పద్ధతిలో మిర్చిసాగు చేస్తున్నాడు. మల్చింగ్ పద్ధతిలో మొక్క చుట్టూ భూమిలో ఉండే తేమ ఆవిరి కాకుండా నివారించడం వల్ల 30 నుంచి 40 శాతం వరకు నీరు ఆదా అవుతుంది. బిందుసేద్యం పద్ధతిలో కలిపి వాడితే అదనంగా 20 శాతం నీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు సోకకుండా చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ జరగక సుమారు 85 శాతం వరకు కలుపును నివారించవచ్చు. మొక్కలకు సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఏర్పడి ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో 20-50శాతం అధిక దిగుబడులు పొందవచ్చు. భూమిలో ఎల్లప్పుడు తేమ నిల్వ ఉండడం వల్ల నేల గుల్లబారి వేరువ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది. దీనివల్ల నీరు, ఎరువులు భూమి లోపల పొరల్లో నుంచి కూడా మొక్కలకు అధికంగా లభ్యమవుతుంది.

జాగ్రత్తలు పాటించాలి..

మల్చింగ్ షీటును బలంగా లాగకూడదు. సాయంత్రం వేళల్లో మాత్రమే షీట్లను అమర్చాలి. ఎందుకంటే దీనికి సాగే గుణం ఉంటుంది. ఎక్కువ గాలి ఉన్నప్పుడు కూడా మల్చింగ్ వేయరాదు. పంట తర్వాత మల్చింగ్ షీటును పొలం నుంచి తీసివేసి పనులు చేసుకోవాలి. 25 మైక్రాన్ల మందం షీట్లు ఒక పంట కాలానికి, 50-200 మైక్రాన్ల మందం షీట్లు 3 సంవత్సరాల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

మల్చింగ్ వేసే విధానం..

మొక్కలకు ఇరువైపులా లేదా చుట్టూరా 5 సెం.మీ నుంచి 10 సెం.మీ లోతు గాడి చేయాలి. మల్చింగ్ షీట్‌ను కావాల్సిన సైజులో కత్తిరించుకోవాలి. ఈ షీటును ప్రతి వరుసలో లేదా చెట్టు దగ్గర మరీ వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. ఈ ప్రక్రియను యాంకరింగ్ అని అంటారు. దీనివల్ల మాల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

అధికారుల సూచనలతో..



వ్యవసాయ అధికారుల సూచనలతో మొదటిసారి మల్చింగ్ పద్ధతిలో ఎకరంలో మిర్చి పంట సాగు చేస్తున్నా. ఈ పద్ధతి ద్వారా కలుపు, ఎరువుల వాడకం తక్కువగా ఉంటుంది.

-ఏలేటి స్వామి రెడ్డి, రైతు, కుందనవానిపల్లి, అక్కన్నపేట మండలం

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లా అధికారుల ఆదేశాలతో రైతులకు మల్చింగ్ పద్ధతిలో సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పద్ధతితో కూరగాయలు, పూల తోటలు సాగు చేయవచ్చు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుంది.

-కరంటోతు శ్రీలత, ఏవో, రామవరం క్లస్టర్



నెమలిని అటవీ శాఖ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

నెమలిపై కోతుల దాడి

కాపాడిన రైతు అటవీ సిబ్బందికి అప్పగింత

హత్నూర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో కోతుల దాడిలో తీవ్రంగా గాయపడి నెమలిని ఓ రైతు కాపాడి, అటవీ శాఖ అధికారులకు అప్పగించాడు. మండల పరిధి దౌలాపూర్‌కు చెందిన చింత వీరేశం వ్యవసాయ క్షేత్రంలో గురువారం ఓ నెమలిపై కోతులు దాడి చేశాయి. మెడ కింద గాయపర్చగా, పొలంలో లేవలేని స్థితిలో పడి పడిపోయింది. కోతుల నుంచి నెమలిని కాపాడిన వీరేశం దానిని దౌల్తాబాద్ పశు వైద్య సిబ్బంది సంగమేష్‌తో ప్రథమ చికిత్స చేయించాడు. అనంతరం అటవీ శాఖ సిబ్బంది మహేందర్‌కు అప్పగించాడు.

సాగునీరు అందించండి..

తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపాలి

మంత్రి ఉత్తమ్‌కు భువనగిరి ఎంపీ వినతి

చేర్యాల/ధూళిమిట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేర్యాల, ధూళిమిట్ట మండలాల్లోని గ్రామాలకు సాగునీటిని అందించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధి రంగనాయకసాగర్ డీ-10కెనాల్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ-3కెనాల్ పరిధిలోని చేర్యాల మండలం అర్జునపట్ల, కమలాయపల్లి, ఆకునూరు, ధూళిమిట్ట మండలం జాలపల్లి, లింగాపూర్, ధూళ్మిట్ట గ్రామాలకు సాగునీరందించాలని వినతిపత్రంలో కోరారు. దేవాదుల ఫేజ్-3ద్వారా చేపట్టిన రామప్ప-ధర్మసాగర్ టన్నెల్ పనులు పూర్తికావచ్చినందున మోటార్లు ఆన్‌చేయించి జనగామ నియోజకవర్గ పరిధిలోని గండిరామారం, బొమ్మకూరు., వెల్దండ, తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి తద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దేవాదుల ఈఎన్‌సీ, సిద్దిపేట ఈఎన్‌సీ హరిరాం, శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీ వెంట మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్ రెడ్డి, నాయకులు నాగపురి కిరణ్‌కుమార్, సింగపాక కుమార్, కొల్పుల యాదగిరి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, కాంగ్రెస్ నేతలు

న్యూస్ బాక్స్

మోడల్ స్కూల్లో అడ్మిషన్లకు 10 వరకు గడువు

వట్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోతులబొగుడ మోడల్ స్కూల్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఈనెల 10 వరకు గడువు ఉన్నదని ప్రిన్సిపాల్ దీన గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ఘనంగా స్వయంపాలన

పుల్‌కల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ఎం.బాలయ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద, శ్రీధర్, శేఖర్, శశికుమారి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులో తనిఖీ

నారాయణఖేడ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీకి సంబంధించి మండలంలోని జూకల్ శివారులో ఉన్న డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ గురువారం తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త నిల్వలను పరిశీలించారు. విండ్రో కంపోస్టింగ్ నిర్వహిస్తున్న తీరును చూశారు. శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌తో పాటు పారిశుధ్య కార్మికులకు అవసరమైన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వసగతి గృహంలో ఏఎస్‌డబ్ల్యూవో తనిఖీ

కంగ్టి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని గురువారం ఏఎస్‌డబ్ల్యూవో చందా శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారికి అందుతున్న మెనూ గురించి తెలుసుకున్నారు. స్టోర్‌రూం, డైనింగ్ హాల్, డార్మెటరీ, కిచెన్, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వార్డెన్ రామప్ప ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై అవగాహన

పెద్దశంకరంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని పేట మండల ఈజీఎస్ ఏపీవో నవాజుద్దీన్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేట మండల పరిధి ఉత్తులూరు గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల గురించి అవగాహన కల్పించారు.

నీట మునిగిన వ్యక్తిని కాపాడిన 108 సిబ్బంది

మెదక్ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామంలో ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తిని 108 సిబ్బంది కాపాడారు. గ్రామానికి చెందిన కమ్మరి చంద్రం ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. అక్కడే చేపలు పడుతున్న వారు వెంటనే బయటకు తీసి 108 సిబ్బందికి సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది ఆక్సిజన్ అందించి ప్రాణాలు కాపాడారు.

చట్టాలపై అవగాహన

కల్హేర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సంస్కారవంతమైన జీవితం అలవాటు చేసుకోవాలని సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు(సుల్తానాబాద్) సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో గురువారం చదువు, ఉద్యోగాలు, డిజిటల్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, లాటరీ ఫ్రాడ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.

చలివేంద్రం ప్రారంభం

చిన్నశంకరంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్ శంకరప్ప స్మారకార్థం కంజర్ల చంద్రశేఖర్, డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎస్‌ఐ పలువురితో కలిసి ప్రారంభించారు.

ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు

- గతంలో ఇలాంటి గోతిలోనే పడి ఇద్దరు చిన్నారులు మృతి
- భయాందోళన చెందుతున్న తండావాసులు
- విచారణ జరిపిన తహసీల్దార్



గొల్లకుంట- కోమటికుంట గిరిజనతండా శివారులో ఇష్టానుసారంగా తవ్విన గొయ్యి

అల్లాదుర్గం, మార్చి 6. (ఆంధ్రజ్యోతి) : రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుపుతుండడంతో తండావాసులు భయాందోళన చెందుతున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని మాందాపూర్-కోమటికుంట రహదారి నిర్మాణం కోసం గొల్లకుంట గిరిజనతండా గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లకుంట- కోమటికుంట గిరిజనతండా శివారులో కొన్నిరోజులుగా మట్టి (మొరం) తవ్వకాలు జరుపుతున్నారని తండావాసులు తెలిపారు. లోతుగా తవ్వకాలు జరుపుతుండడంతో వర్షాకాలంలో ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదం పొంచి ఉన్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గొల్లకుంటతండా సమీపంలో ఇలాంటి గొయ్యిలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారని తండావాసులు గుర్తుచేశారు. కాంట్రాక్టర్ తన స్వార్థ ప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేయడంతో తహసీల్దార్ స్పందించి, గొయ్యిలను సందర్శించి విచారణ జరిపారు. మట్టి తవ్వకాల కోసం అనుమతి పొందినా.. ఇలా లోతుగా తవ్వకాలు జరపొద్దని కాంట్రాక్టర్‌కు ఆదేశించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

బాలింత మృతిలో డాక్టర్ల నిర్లక్ష్యం లేదు

- హాస్పిటల్ యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలోని వెల్‌నెస్ హాస్పిటల్‌లో ఈ నెల 1న జరిగిన బాలింత మృతి ఘటనపై డాక్టర్ల నిర్లక్ష్యం లేదని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు లాలేష్, వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్లతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర రక్తస్రావంతో ఆస్పత్రికి వచ్చిన వెంటనే అడ్మిట్ చేసుకొని వైద్య చికిత్సలు ప్రారంభించామన్నారు. డాక్టర్ల నిర్లక్ష్యం లేకున్నా సంగారెడ్డిలో కొందరు వ్యక్తులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఆస్పత్రి, సిబ్బందిపై దాడి చేయించారన్నారు. గతంలో హాస్పిటల్ యాజమాన్యం నుంచి డబ్బులు వసూలు చేయాలని వారు ప్రయత్నించిన విషయాన్ని తాము గుర్తించామని తెలిపారు. హాస్పిటల్‌పై జరిగిన దాడిలో సుమారు రూ.1.5 కోట్ల ఆస్తి నష్టంతో పాటు రూ.10 కోట్ల మేర పరువు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి ఆధారాలతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ సమావేశంలో వైద్యులు డా.సురేశ్‌బాబు, డా.హర్షవర్ధన్, డా.జహీర్‌ఖాన్, మార్కెటింగ్ మేనేజ్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే పరమాత్ముడి సేవ చేయాలి

- రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి



ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న మాధవానంద సరస్వతీ

నారాయణఖేడ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతోనే పరమాత్ముని సేవ చేయాలని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. గురువారం ఖేడ్ పట్టణ శివారులో నిర్మించిన భక్త మార్కండేయ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనలో వివిధ పీఠాధిపతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవానందస్వామి మాట్లాడుతూ పూజలు చేయడమే కాదని, సంస్కృతీ సంప్రదాయాలను కుటుంబ విధానాలకు అనుగుణంగా వ్యవహరించి పూజలు చేసినప్పుడే భగవంతుడి కృప కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప, అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్, పండరీపూర్ పీఠాధిపతి అంబాదాస్‌మహరాజ్, పంచగామ పీఠాధిపతి కాశీనాథ్‌బాబా, దుద్యాల పీఠాధిపతి అంబికా శివయోగి, జుక్కల్ పీఠాధిపతి గోపాల్‌మహరాజ్, దత్తుమహరాజ్, పండరీమహరాజ్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వేదబ్రాహ్మణులు గురురాజ్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన నిర్వహించారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్, టీపీసీసీ సభ్యుడు కె.శ్రీనివాస్, పద్మశాలీ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

రాచన్నస్వామి కల్యాణం కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కోహీర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు గురువారం స్వామివారి కల్యాణంతో ముగిశాయి. చివరిరోజైన గురువారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన అన్న పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీభద్రకాళీదేవి సహిత రాచన్నస్వామికి కల్యాణం జరిపించారు. ఈ వేడుకల్లో ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్ స్వామివారిని దర్శించుకున్నారు.

మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

పుల్‌కల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతూరులో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర, విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠాపన ధృక్‌బలి, పూర్ణాహుతి, ఆశీర్వచనం తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 4న ప్రారంభమైన ప్రతిష్ఠాపనలు 11వరకు జరగనున్నాయి.

గాంధీనగర్ కాలనీలో...

ఐడీఏబొల్లారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏ బొల్లారం పట్టణ పరిధి గాంధీనగర్ కాలనీలో లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉదయం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి పల్లకీ ఊరేగింపు జరిపారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన

రామచంద్రాపురం టౌన్: రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మితమైన రామాలయం, శివాలయం, సరస్వతీదేవి, జంటనాగుల ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు నుంచి ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వేద పండితులు ప్రత్యేక పూజలు జరుపుతారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి



రెడ్ క్రాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సమావేశమైన జిల్లా చైర్మన్, సభ్యులు

రామాయంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణపై రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సమావేశమైంది. ఈ మేరకు గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌తో రెండు గంటలపాటు సమీక్షా సమావేశం నిర్వహించారు. సుమారు రూ.8 లక్షల విలువైన ఖర్చుతో శిబిరాలను ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. వీఎస్‌టీ సంస్థ సౌజన్యంతో తూప్రాన్ మండలంలోని మూడుగ్రామాలు ఎంచుకొని రెండువేల మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించే వీలుగా ఈ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమీక్షలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, డీజీ శర్మ, చంద్రబోస్, దామోదర్ రావు, దేమె యాదగిరి, మెట్టు యాదగిరి, మద్దెల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

సంగారెడ్డి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చిల్వేరి చంద్రశేఖర్, అధ్యక్షుడిగా తెనుగు జనార్ధన్, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.రాములులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పిట్టల రమేశ్, కోశాధికారిగా వి.ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా ఎం.తిరుమల్‌రావు, పి.రాంగోపాల్, టి.రాంచందర్, ఎస్‌వీ.శ్రీనివాస్, కె.లక్ష్మీ, పి.సుగుణాకర్, సంయుక్త కార్యదర్శులుగా జి.మల్లయ్య (ఆర్టీసీ), పూజారి ప్రభాకర్, జి.శ్రీనివాస్ (ఎస్‌కె), బస్సు సాయికిరణ్, ఈర్ల అంజయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటుగా ప్రచార కార్యదర్శిగా జి.రామకృష్ణ, (ఆర్‌కె), సహాయ ప్రచార కార్యదర్శిగా ఎన్.నర్సింలు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జె.కృష్ణ, ఎ.కృష్ణ, ఎం.కేశవులు, బి.దుర్గయ్య, బస్వరాజ్, ఎం.ఆనంద్‌కుమార్, సలహాదారులుగా మిఠాయి నారాయణ, డి.నారాయణ, మామిళ్ల ఆంజనేయులు, ఎస్.అంజయ్య, జి.చంద్రశేఖర్, బి.మురళీధర్ ఎన్నికయ్యారు.

అల్లాదుర్గం-మెటల్ కుంట రోడ్డును జాతీయ రహదారిగా మార్చండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరిన జోగినాథ్



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జోగినాథ్

జోగిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అల్లాదుర్గం-మెటల్‌కుంట అంతర్రాష్ట్ర రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించి, పునర్నిర్మించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మాజీ చైర్మన్ గంగా జోగినాథ్‌గుప్తా కోరారు. గురువారం ఢిల్లీలోని తన కార్యాలయంలో కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

బీజేపీ గెలుపుతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం



నర్సాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో సంబురాలు చేసుకుంటున్న నాయకులు



పెద్దశంకరంపేటలో బాణసంచా కాలుస్తూ సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

నర్సాపూర్/పెద్దశంకరంపేట/ నిజాంపేట/ మాసాయిపేట/మనోహరాబాద్/తూప్రాన్/చిలప్‌చెడ్/చిన్నశంకరంపేట/చేగుంట/రామాయంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ పట్టభద్రులు, టీచర్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంతో బీజేపీ కార్యకర్తల్లో నూతనోత్తేజం కలిగిందని ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నర్సాపూర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ గెలిచిన సందర్భంగా బస్టాండ్ సమీపంలో ప్రధానరోడ్డుపై టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. పెద్దశంకరంపేటలోని బస్టాండ్ ప్రధాన రహదారిపై బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో మిఠాయిలు తినిపించుకున్నారు. నిజాంపేట మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, మాసాయిపేటలో బీజేపీ మండల నాయకులు వేణు, నాగేందర్‌రెడ్డి, రాములు, సాయిలు ఆధ్వర్యంలో, మనోహరాబాద్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్, తూప్రాన్‌లో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు జానకీరామ్, దుర్గరాజ్, సాయిబాబా, లక్ష్మణ్‌సింగ్, చిలప్‌చెడ్ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో, చిన్నశంకరంపేట మండలంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చేగుంటలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ ఆధ్వర్యంలో, మండల కేంద్రమైన శివ్వంపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దపులి రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి అశోక్‌సాదు ఆధ్వర్యంలో, రామాయంపేటలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాగి రాములు, శీలం అవినాష్‌రెడ్డి, తీగల శ్రీనివాస్‌గౌడ్, వెల్మల సిద్ధిరాములు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.

సంగారెడ్డి జిల్లాలో

●కంగ్టి/జహీరాబాద్/మునిపల్లి/జిన్నారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కంగ్టిలో సుభాష్ చంద్రబోస్ చౌక్ వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. జహీరాబాద్ పట్టణంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్‌జగన్, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, జనార్ధన్‌రెడ్డి, బక్కయ్యగుప్తా సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. మునిపల్లి మండలంలోని బుదేరా చౌరస్తాలో మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. జిన్నారంలో పార్టీ మండల, జిల్లా నాయకులు జగన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్, రమేష్ ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ప్రజలు, విద్యావంతులు నమ్మడం లేదన్నారు.

నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడమే ఇందిరమ్మ పథకం సంకల్పం

- టీపీసీసీ కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు



కంది మండలం చేర్యాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు

కంది/మునిపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నిజమైన నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడమే ఇందిరమ్మ పథకం సంకల్పమని టీపీసీసీ కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు అన్నారు. కంది మండల పరిధిలోని చేర్యాల గ్రామంలో గురువారం గ్రామస్థులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ చేర్యాలలో తొలి దశలో 165 మంది లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సారా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుంతపల్లి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి సుధీర్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజర్ పాల్గొన్నారు. అలాగే మునిపల్లి మండల పరిధి ఇబ్రహీంపూర్‌లో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు షేక్‌అలీ పాల్గొన్నారు.

సాగునీటిని అడ్డుకుంటే కఠిన చర్యలు: డీటీ



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈ

జోగిపేట రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందే సాగునీటిని అడ్డుకుంటే కఠినచర్యలు తప్పవని అందోలు మండల డిప్యూటీ తహసీల్దార్ సాగర్ మధుకర్‌రెడ్డి, ఎస్‌ఐ పాండు, ఇరిగేషన్ ఏఈ మజహర్ సంగుపేట రైతులను హెచ్చరించారు. గురువారం జోగిపేట మండలం సంగుపేట శివారులోని పెద్ద చెరువును, కాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సంగుపేట శివారులోని పెద్ద చెరువు నుంచి కట్టు కాలువ ద్వారా సంగుపేటతోపాటు, పొరుగుననే ఉన్న చందంపేట, అల్మాయిపేట గ్రామ ఆయకట్టుకు సాగునీరందుతోంది. అయితే ఈ నీటి విషయమై అల్మాయిపేట, సంగుపేట గ్రామాల మధ్య కొంతకాలంగా గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తమ గ్రామంలోని ఆయకట్టుకు రావాల్సిన నీటిని రాకుండా సంగుపేట రైతులు అడ్డుకుంటున్నారంటూ అల్మాయిపేట రైతులు... రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం వారు సంగుపేట రైతులతో సమావేశమై మాట్లాడారు. సింగూరు నుంచి గొలుసు కట్టు కాల్వల ద్వారా అందే సాగునీరు మండలంలోని అన్ని గ్రామాల పంటలకు అందాలని, దీనిని ఎవరు అడ్డుకున్నా కఠిన చర్యలు తప్పవని రైతులను హెచ్చరించారు.

తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

నిజాంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగ స్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ సర్పంచ్ నరసింహారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రజక సంఘ సభ్యులు, మాజీ ఎంపీటీసీ, మాజీ ఉపసర్పంచ్ పాల్గొన్నారు.

నీటి కోసం పాట్లు



వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

నర్సాపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే మంజీరా నీటి సరఫరా పైపులైన్ మరమ్మతుతో నర్సాపూర్ ప్రాంతానికి నీటి సరఫరా బంద్ అయ్యింది. దీంతో మండలంలోని ఆవంచ గ్రామానికి నాలుగురోజులుగా మంచినీరు రాకపోవడంతో ప్రజలు సమీప పొలాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేసి నీటి సరఫరా చేయాలని కోరారు.

రూ.2 లక్షలతో నీటి శుద్ధి కేంద్రం



నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కంది, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కలుషితమైన నీటిని తాగడం వల్ల కలరా, జాండిస్ వంటి జబ్బుల బారినపడి పాఠశాలకు గైర్హాజరు కావడంతో విద్యలో వెనుబడిపోతుండేవారు. వారిని ఆదుకోవడానికి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్యూర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ సహకారం అందించింది. ఆ సంస్థ ప్రతినిధులు గురువారం మండల పరిధిలోని ఇంద్రకరణ్ ప్రాథమిక పాఠశాలలో రూ.2 లక్షలతో నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జొగప్ప, ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఠాకూర్ ఉదయ్‌సింగ్, పంచాయతీ సెక్రెటరీ వాణి పాల్గొన్నారు.

మాదిగల జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

జహీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మాదిగల జనాభా ప్రకారం రిజర్వేషన్లను కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షమీమ్‌అక్తర్ రిపోర్టులో ఉన్న లోపాలను సరిచేసి మాదిగలకు, అన్నికులాలకు న్యాయం చేయాలన్నారు. ముందుగా డప్పుల ప్రదర్శన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నుంచి ప్రధాన రహదారి మీదుగా సుభాష్‌గంజ్ చౌరస్తా వరకు కొనసాగింది.